ప్రశ్నార్థకంగా పంటల సాగు

- యాసంగిలో తగ్గిన విస్తీర్ణం
- వరిపై మొగి పురుగు..ఆరుతడి పంటలపై చీడపీడల తీవ్ర ప్రభావం
- ఆందోళనలో రైతన్నలు



బిలోలి శివారులో మొగిపురుగు సోకడంతో దెబ్బతిన్న వరిపంట



లోకేశ్వరంలో సరిగా మొలకెత్తని మొక్కజొన్న పంట

లోకేశ్వరం: ఆరుగాలం కష్టించి అన్నదాతలు పండిస్తున్న యాసంగి పంటల సాగు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. వాతావరణం ప్రతికూలంగా మారడంతో ఆరుతడి పంటలపై చీడపీడల ప్రభావం ఎక్కువైంది. దీంతో దిగుబడులు చేతికి వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

వరి..వర్రీ..!

రబీ(యాసంగి)లో వరి పంట సాగు ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాల్లో చెరువుల కింద కొంత, బోరు బావుల వద్ద కొంత వరితోపాటు ఆరుతడి పంటలైన మినుము, జొన్న, మొక్కజొన్న, కుసుమ, శనగను సాగు చేస్తున్నారు. కానీ వరి పంటకు మొగి పురుగు సోకి వందలాది ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. చాలా చోట్ల మొగి పురుగు ధాటికి వరి తీవ్రంగా దెబ్బతింది. ఆరుతడి పంటలపై చీడపీడల ప్రభావం తీవ్రంగా ఉంది. దీంతో రైతులు వారికి తెలిసిన మందులనే రెండు, మూడు సార్లు పిచికారీ చేస్తూ ఆర్థికంగా నష్టాలపాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించడం లేదు.



కన్కపూర్‌లో ఎర్రబారిన వరి పంట

గణనీయంగా తగ్గిన సాగు..

లోకేశ్వరం మండలంలో రబీ పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. కన్కపూర్, పిప్రి, ధర్మోర, రాయపూర్‌కాండ్లీ, రాజూరా, మన్మద్, పుస్పూర్ గ్రామాల్లో 18 వేల ఎకరాల్లో వరి పండించాల్సి ఉంది. కానీ ఈ సీజన్‌లో కేవలం 11 వేల ఎకరాల్లో మాత్రమే వరి పండిస్తున్నారు. వాతావరణ మార్పులు, చీడపీడల ప్రభావంతో అరుతడి పంటలపైనే రైతులు మొగ్గు చూతున్నారు. అలాగే వాతావరణ మార్పుల వల్ల పంటలపై చీడపీడల ప్రభావం ఎక్కువైంది.పంటపై చీడపీడల నివారణ కోసం రసాయన మందులను పిచికారి చేస్తున్నప్పటికి పలితం ఉండడంలేదని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గంలో మొక్కజొన్న ఎనిమిది వేలు, శనగ రెండు వేలు, ధనియాలు 800 ఎకరాలు, పొద్దుతిరుగుడు 1100 ఎకరాల్లో సాగు చేశారు.

రెండెకరాల్లో సాగు చేస్తున్న



అధిక వర్షాలతో వానాకాలంలో పంటలు నష్టపోయాం. ఇప్పుడేమో పంటలకు తెగుళ్లు, చీడపీడలు సోకి దెబ్బతింటున్నాయి. రెండెకరాల్లో వరి సాగు చేస్తున్నా. నాట్లు వేసినప్పటి నుంచి వాతావరణం అనుకూలించడం లేదు. పంటకు పురుగు సోకింది.. మందులు పిచికారీ చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. – పోతారెడ్డి, పుస్పూర్

సగం వరకు ఎండింది



రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పంటకు తెగుళ్లు సోకి ఎండిపోతుంది. పంటను కంటికి రెప్పలా కాపాడుతూ వారం రోజులకోకసారి పిచికారీ చేస్తున్నాం. ఇప్పటివరకు మందులకే రూ.ఎనిమిది వేలైంది. నాకుం ఏం చేయాలో తోచడం లేదు.

– సదానందం, రాయపూర్‌కాండ్లీ

నివారణ చర్యలు చేపట్టాలి

ఖరీఫ్‌లో అధిక వర్షాలకు పత్తి పంటలు ఎర్రబారి నష్టం వాటిల్లింది. తక్కువ నీటి తడులు అవసరమయ్యే పంటలను యాసంగిలో సాగు చేయాలి. వరి, మొక్కజొన్న, ధనియాలు, శనగ, పొద్దుతిరుగుడు పంటలకు తెగుళ్లు సోకితే తమకు తోచినట్లు కాకుండా రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలి. వారి సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలి.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

అలరించిన వీడ్కోలు వేడుకలు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్‌హాలులో ఆదివారం వాసవి పాఠశాల విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. నిజామాబాద్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ముత్యం రెడ్డి, సైకాలజిస్ట్ శ్రీనివాస్ పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తమ ఉపాధ్యాయులతో కలిసి నడిచిన అనుభవాలను విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. అనంతరం వారు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ లింగారెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, సెక్రెటరీ జగదీశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, శ్రీనివాస్, శైలజ, సుహాసిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కిష్టాపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న నాయకులు



ఓలాలో పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ గజ్జారాం

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.3.50 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీజేపీ ముధోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శైలజ, శ్రీకాంత్‌గౌడ్, చిన్నారావు, రాజు, దోమల భోజన్న, జీవన్ రెడ్డి, నారాయణ్‌రెడ్డి, మనోజ్‌కుమార్, సాయికుమార్ ఉన్నారు.

కుంటాల: గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఓలాలో ఉపాధి నిధులు రూ.8.50 లక్షలు, దౌనెల్లిలో రూ.4 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మౌనిక నవీన్, కోఆప్షన్ సభ్యులు గౌస్, ఎంపీటీసీ కట్ట రవి, మాజీ సర్పంచ్ ఎండీ హైమద్, సాయికుమార్, రాజేశ్వర్, సమీర్, ఖదీర్, గంగాధర్, ప్రసాద్, లక్ష్మణ్, గంగారాం, సుదర్శన్, సన్నేసాబ్, అలీం పాల్గొన్నారు.

'27న సభను జయప్రదం చేయాలి'

ఖానాపూర్: భైంసాలోని కేఎస్ గార్డెన్‌లో ఈనెల 27న నిర్వహించే తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ స్వర్ణోత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేశ్ కోరారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని కార్మికులు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి ముఖ్య వక్తలుగా ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జాతీయ ఉపాధ్యక్షుడు ప్రదీప్, ప్రొఫెసర్ సుజాత తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో దుర్గం లింగన్న, చిన్న రాజన్న, గూట్ల ప్రసాద్, మాలవత్ జేవింద్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఉద్యమ చరిత్ర రచన కమిటీ ఎన్నిక

భైంసాటౌన్: 'తెలంగాణ ఉద్యమం–ముధోల్ నియోజకవర్గ సమగ్ర చరిత్ర' పుస్తక రచన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. భైంసా పట్టణంలోని గురుకృప వొకేషనల్ జూనియర్ కళాశాలలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు డాముష్కం రా మకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రధాన సంపాదకులుగా గంగుల చిన్నన్న, సోమ జనార్దన్ రెడ్డి, సంపాదకులు, సహాసంపాదకులుగా కదారి దశరథ్, పీసర శ్రీనివాస్‌గౌడ్, బసవరాజు, రెడ్ల బాలాజీ, జాదవ్ పుండ్లిక్‌రావులకు బాధ్యతలు అప్పగించారు. పలువురు ఆయా మండలాల తెలంగాణ ఉద్యమ చరిత్ర రచనా కమిటీ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వారి వెంట పలువురు ఉన్నారు.

రేణుకాఎల్లమ్మ ఉత్సవాలు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో రేణుకాఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల వేడుకలో భాగంగా ఆదివారం గౌడ కులస్తులు పోచమ్మతల్లికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. సోమవారం రేణుక ఎల్లమ్మకు బోనాలు సమర్పిస్తారు. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాలకు గౌడ సంఘం సభ్యులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం అమ్మవారి కల్యాణం సందర్భంగా మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఏర్పాట్లు పరిశీలన

ఖానాపూర్: షబ్ ఏ బరాత్ జాగారం(జగ్‌నేకా రాత్)లో భాగంగా పట్టణంలోని పలు మ జీ దుల్లో ఆదివారం నిర్వహించే పండుగ ఏర్పాట్లను మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, నాయకులు పరిశీలించారు. ముస్లింలు పవిత్రరాత్రిగా భావించే ఉత్సవాలు జరిగే చోట పారిశుధ్య పనులు చేయించారు. షబ్బీర్‌పాషా, పరిమి సురేశ్, సలీంఖాన్, మహ్మద్ ఖాజా తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పద్మశాలీ సంఘ కార్యవర్గం



ఎన్నికైన సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణంలోని బాగులవాడ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా అల్లం భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కొక్కుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా గుద్దేటి అరవింద్, కోశాధికారిగా పెంటు రవి, ఉప కోశాధికారిగా అయిట్ల జగదీశ్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనరసయ్య, తిరుమలేష్, ముఖ్య కార్యనిర్వహణాధికారిగా మూట గణేశ్, చిలుక దశరథ్, సాంస్కృతిక కార్యదర్శిగా ఐట్ల ప్రవీణ్ తోపాటు ఇతరులను సలహాసభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గాన్ని సన్మానించారు.

వీడీసీ కార్యవర్గం

కుంటాల: మండలంలోని కల్లూర్ వీడీసీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ వెంకట్, ఉపాధ్యక్షుడిగా పండుగ జీవన్, కోశాధికారులుగా ప్యాట్ల రజినీకాంత్‌రావు, ఆడిటర్‌గా మహమ్మద్, సలహాదారు సభ్యులుగా సాయన్న, రాజేశ్వర్, సుదర్శన్‌గౌడ్, బద్దం నరేందర్, మహే శ్, భోజన్న, దినేశ్, కాశీరాం, రాజేశ్వర్, సంపత్, దత్తు తదితరులు ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని సభ్యులు పేర్కొన్నారు.

దివ్యాంగుల సంఘం..

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో ఆదివారం ఆదర్శ దివ్యాంగుల సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రత్యేక సమావేశంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు ముత్యం, సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా అరటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఓస రవీందర్, జనరల్ సెక్రెటరీగా గడ్వాంద గంగన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కుంటాల ఎస్సైగా రజనీకాంత్



కుంటాల: ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు కుంటాల మండల ఎస్సైగా వి. రజినీకాంత్ నియమితులయ్యారు. త్వరలో ఉ ద్యో గ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన గతంలో పెంబి ఎస్సైగా పని చేశారు. ఇక్కడ పని చేసిన ఎస్సై హన్మాండ్లు బదిలీపై పెంబి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

ఘనంగా భీమన్న ఉత్సవాలు



ఎక్బాల్‌పూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్, రాజూరా గ్రామాల్లో ఆదివారం భీమన్న దేవుడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమీపంలోని వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక తీర్థప్రసాదం, అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నా రు.

విద్యుదాఘాతంతో దూడ మృతి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో దూడ మృతిచెందింది. గ్రామంలోని మెట్‌పల్లి రహదారి పక్కన గల కుంట వద్ద కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ తగిలి దూడ అక్కడికక్కడ చనిపోయింది. దీని విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనకు పరిహారం అందించాలని బాధిత రైతు ఆశన్న కోరాడు. గతంలో గొర్రెలు మృతిచెందగా, తాజాగా దూడ చనిపోయిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి



బహుమతి అందిస్తున్న ఎంపీపీ రజాక్

భైంసారూరల్: యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ అబ్దుల్ రజాక్ అన్నారు. ఆదివారం మండలంలోని దేగాం గ్రామంలో అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు వేడుకలకు హాజరై మాట్లాడారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన భైంసాకు చెందిన మిలన్ జట్టుకు రూ.30వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన దేగాం జట్టుకు రూ.15 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సుభాశ్‌పటేల్, చందర్, చంద్రకాంత్, నందకుమార్, తూకారం తదితరులు ఉన్నారు.

సాఠె ఆశయ సాధనకు కృషి చేయాలి

- సచిన్ బావుసాఠె, ఎమ్మెల్యే రామారావ్ పటేల్
- ఉమ్రి(కె)లో సాఠె విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే రామారావ్‌పటేల్, సాఠె మనువడు సచిన్‌బావుసాఠె

తానూరు: లోక్‌శాహిర్ అన్నాబావుసాఠె ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన మనువడు సచిన్ బావుసాఠె అన్నారు. ఆదివారం మండలంలోని ఉమ్రి(కె) గ్రామంలో అన్నాబావుసాఠె విగ్రహం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం సాఠె ఎంతో కృషి చేశారని.. వారు రాసిన కదంబరి గ్రంథాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు. ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ మాట్లాడుతూ అంబేద్కర్, శివాజీ మహారాజ్, అన్నాబావుసాఠెల ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. గ్రామంలో అన్నాబావుసాఠె భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు కమిటీని ఏర్పాటుచేసిందన్నారు. మత్తు పదార్థాల విక్రయంపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారని.. యువకులు సైతం చెడు వ్యసనాలకు దూరం ఉండి సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు చిన్నారెడ్డి, శివాజీపటేల్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఉత్తం బాలేరావు, సొసైటీ వైస్ చైర్మన్ నాగ్‌నాథ్, గ్రామ అధ్యక్షులు గంగాధర్ ఉన్నారు.

కనులపండువగా లక్ష్మీనృసింహుడి రథోత్సవం



ఆలయంలో స్వామివారు



రథానికి పూజలు చేస్తున్న భక్తులు

కడెం: అక్కకొండ లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి జాతర, ఆదివారం తెల్లవారుజామున నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి లక్ష్మీనరసింహుడిని దర్శించకున్నారు. సోమవారం బ్రహోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జగ్గరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజారామేశ్‌గౌడ్ తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కడెం: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధికి పాటుపడతామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం మండలంలోని అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి, ధర్మాజీపేట్ గ్రామంలో భీమన్న దేవుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదం అందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, మల్లేశ్, సత్యం, భూమేశ్, నరేందర్‌రెడ్డి, సత్తెన్న, కమలాకర్, భూషణ్ తదితరులు ఉన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఘనంగా పెద్దమ్మతల్లికి పూజలు

పెంబి: మండలంలోని మందపల్లిలో ఆదివారం శ్రీ పెద్దమ్మతల్లి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయం ముందు అగ్నిగుండాలు దాటుతూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు మండలంతోపాటు ఖానాపూర్, కడెం, మామడ, జగిత్యాల, తదితర మండలాల నుండి భక్తులు తరలివచ్చారు. కేశఖండనలో భాగంగా మేకలు, కోళ్లు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌కు చెందిన ఓ భక్తుడు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు అర్జన్న, విష్ణు, భోజన్న పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

సోన్: మండలంలోని కడ్తాల్‌లో శ్రీపెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని శ్రీ అయ్యప్ప ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమను భాజభజంత్రీల నడుమ ఊరేగించారు. ఈసందర్భంగా మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. సోమవారం నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపనకు భక్తులు తరలిరావాలని ముదిరాజ్ కులస్తులు పేర్కొన్నారు.



పెంబి : అగ్నిగుండం దాటుతున్న భక్తులు



సోన్: కడ్తాల్ వేడుకలో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు

- ముస్తాబైన మహాదేవుడి ఆలయం

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో ఇటీవల శ్రీశ్రీశ్రీ శివ పంచాయతన మహాదేవ స్వామి ఆలయం నిర్మించారు. ఈనెల 26 నుంచి ఈనెల 28 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం విగ్రహాల ఊరేగింపు, మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, పంచగవ్య సంస్కారం, రక్షాబంధనం, ఆచార్యాది రుత్విక్ వరణం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, చతుష్షష్టి యోగిని సహిత వాస్తు, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల దేవత కలశస్థాపన పూజ, అగ్నిప్రతిష్ఠ, లక్ష్మీగణపతి హవనం, సాయంత్రం స్థాపితాదేవత హవనం సూక్త, ప్రతిష్టాంగ హోమాలు, గ్రామస్తులచే నదీ జలాల ఊరేగింపు, పంచగవ్య పంచామృత స్వప్నం, జలాధివాసం, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ ఈనెల 27న ఉదయం 8 గంటలకు కర్మనః, పుణ్యాహవచనం, స్థాపిత దేవత పూజలు, ప్రతిష్ఠ మూలమంత్రం, హోమం, తాపితా దేవతహవనం, సుక్త హోమాలు, ధాన్యాదివాసం, ఫల, పుష్ప, సయ్యాధివాసం, సామూహిక కుంకుమార్చన, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ, ఈనెల 28న ఉదయాత్ పూర్వం పుణ్యాహవచనం, గర్తన్యాసం, బీజన్యాసం, దాతున్యాసం, విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ, ధృక్‌బలి, దిక్‌బలి, కలశ ఉద్వాసన, కుంభ సంప్రోక్షణ, స్వామివారి దర్శనం, శాంతి కల్యాణం మహా నైవేద్యం, హారతి మంత్రపుష్పం, పండితుల సన్మానం, అన్నప్రసాద సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు తరలివచ్చి ప్రతిష్ఠాపన మహోత్సవాలను విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు.



పెంచికల్‌పాడ్‌లో వేడుకలకు సిద్ధమైన ఆలయం

ఆవు మృతి

మామడ: మండలంలోని ఆదర్శనగర్ గ్రామంలో బర్కుంట పెద్దసాయన్నకు చెందిన ఆవు ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తుండగా విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే ఓ ఆవు మృతి చెందింది.